## ఎన్‌జీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

రామగిరి, నవంబర్ 22 : నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు కోర్సుల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్థశాస్త్రం 1, జంతుశాస్త్రం 1 ఖాళీలున్నాయని, ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన వారికి ఈ నెల 26న ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని తెలిపారు.

## రేపు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్

సూర్యాపేట టౌన్, నవంబర్ 22 : ఈ నెల 24న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓపెన్, అండర్ 11, 15 బాలబాలికలకు చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి నగదుతోపాటు షీల్డులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఎల్.సతీశ్‌కుమార్ 9394753343 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.




సంక్షేమ వసతి గృహాలపై సమీక్ష నిర్వహిస్తున్న సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తా

- విద్యార్థులతో మెస్ కమిటీలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, నవంబర్ 22 : జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో ఏ సమయంలోనైనా ఆకస్మిక తనిఖీలు చేస్తానని, వసతి గృహాల్లో ఎలాంటి సమస్యలు కనిపించినా చర్యలు ఉంటాయని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సంక్షేమ అధికారులు, ఆర్డీఓలు, తాసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో మెస్ కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ అధికారులు వసతి గృహాలకు కావాల్సిన నిత్యావసర సరుకులు, కూరగాయలు , బియ్యం వంటివి తప్పకుండా మెస్ కమిటీకి చూపించి రిజిస్టర్లలో వారి సంతకం చేపించాలని తెలిపారు. అందుకు రెండు రిజిస్టర్లు పెట్టాలని ఆదేశించారు. వసతి గృహాల్లో వంటశాలతోపాటు వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటిని పరీక్షకు పంపించాలని వసతి గృహ నిర్వాహకులకు సూచించారు. అద్దె బిల్డింగ్‌లో ఉన్న వసతి గృహాల యాజమానులు ఐదు శాతం పరిశుభ్రతకు నిధులు కేటాయించాలన్నారు. ప్రతి విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల్లోని స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించాలని తాసీల్దార్లకు సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎస్ఓ రాజేశ్వర్, డీఈఓ అశోక్, సివిల్ సప్లయ్ డీఎం ప్రసాద్, సంక్షేమ అధికారులు శంకర్, లత, జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ చెబితేనే బోనస్

## ప్రత్యేక యంత్రం నిర్ధారిస్తేనే సన్నరకం ధాన్యం సేకరణ

- అన్ని రకాల సన్న వడ్లకు గుర్తించని మిషన్
- మరోవైపు తేమ శాతం ఎక్కువున్నా నిరాకరణ
- రూ. 500 ఆశతో ఎక్కువగా సన్నాల సాగు.. అయోమయంలో రైతన్న
- షరతులు లేకుండా బోనస్ ఇవ్వాలని అన్నదాతల డిమాండ్

నేరేడుచర్ల, నవంబర్ 22 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొత్త సమస్య రైతులను వేధిస్తున్నది. సన్న వడ్లను విక్రయించేందుకు ముందుగా ఒక ప్రత్యేక యంత్రం(క్యాలీబర్)లో వేసి నిర్ధారించుకోవాలి. కానీ ఆ మిషన్‌లో అన్ని రకాల సన్న వడ్లకు అవకాశం లేకపోవడం ఇందుకు కారణం. తాము పండించిన సన్నాల రకం ఈ యంత్రంలో లేకపోతే ఎలాగని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలు సన్న వడ్లకు రూ. 500 బోనస్ ప్రకటించడంతో చాలా మంది రైతులు దొడ్డు రకాల వరి సాగుకు స్వస్తి చెప్పి సన్నాలకు మొగ్గు చూపారు. ప్రసుత్తం చాలా మంది రైతులు పంట కోసి ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. మరి కొంత మంది రైస్ మిల్లుకు అమ్ముకున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం సన్న రకం వడ్లను కొనుగోలు చేయాలంటే పలు రకాల షరతులు పెట్టడంతో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. సన్న రకం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే వ్యవసాయాధికారులు మిషన్ ద్వారా నిర్ధారించుకోవాలి. అనంతరం కొనుగోలుకు అవకాశం కల్పిస్తారని డీసీఎంఎస్, ఐకేపీ సిబ్బంది చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న షరతులు తట్టుకోలేక సన్నరకం పండించిన చాలా మంది రైతులు కోత మిషన్ల ద్వారా కోయించి నేరుగా రైస్ మిల్లులకు విక్రయిస్తున్నారు.



నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

### నష్టాల్లో రైతులు

సన్న రకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దాంతో ఎక్కువగా సన్న రకం వరి సాగు చేశారు. ఏ రకం అయినా సన్న వడ్లు అనగానే ధరలు అధికంగానే ఉంటాయి. దొడ్డు రకాల వడ్లకు గరిష్టంగా రూ. 2,320 వరకు ఉండగా సన్న రకాల వడ్లకు మాత్రం క్వింటాలుకు రూ. 3వేల నుంచి రూ. 3,500 వరకు ఉంటుందని రైతులు అనుకున్నారు. దీనికి తోడు ప్రభుత్వం అందిచే బోనస్‌తో కలుపుకొని సన్నరకాల వడ్లకు ధర మంచిగా వస్తుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. గత ప్రభుత్వంలో సన్న రకాలను మిల్లర్లు కూడా క్వింటాకు రూ.3వేల నుంచి రూ.3300 వరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం బోనస్ లేకుండా క్వింటాలుకు రూ. 2,320 ప్రకటించడంతో ప్రైవేటు వ్యాపారులు కూడా ధరలను పూర్తిగా తగ్గించారు. ప్రభుత్వం అందిస్తున్న ధరల కంటే తక్కువగానే కొనుగోలు చేస్తున్నారు. ఇదేంటని రైతులు ప్రశ్నిస్తే ప్రభుత్వం ధరలు తగ్గించడంతో మార్కెట్‌లో సన్న వడ్లకు డిమాండ్ తగ్గిందని చెబుతున్నారు.



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం కొలిచే యంత్రం

### షరతులు లేకుండా సన్న ధాన్యం కొనుగోలు చేయాలి

రైతు పండించిన సన్న ధాన్యానికి ఎటువంటి షరతులు లేకుండా బోనస్ చెల్లించాలి. మిషన్ కొలతలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మిల్లుకు సన్న ధాన్యం తీసుకెళ్తే వాళ్లు ఇంకా తక్కువ ధరకు అడుగుతున్నారు. ప్రభుత్వం రైతుల బాధను అర్థం చేసుకొని మిషన్‌తో పని లేకుండా సన్నధాన్యం కొనుగోలు చేయాలి.

–ఎల్లావుల వెంకటేశ్వర్లు, రైతు, గరిడేపల్లి మండలం






జిల్లా క్రైమ్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

## ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరతగతిన విచారణ చేయాలి

- ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా పనిచేయాలి
- ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, నవంబర్ 22 : పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులతోపాటు ఫోక్సో కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఫైనల్ చేయాలన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసులు పరిష్కరించడంలో, శిక్షలు వేయించడంలో అవసరమైతే న్యాయమూర్తుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓవర్‌లోడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడిపే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెడుతూ విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని తెలిపారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా యువతకు గంజాయి, మాదక ద్రవ్యాలు వాడకం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు రమేశ్, శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, గిరిబాబు, లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

## యాదాద్రి జిల్లాకు కొత్తగా ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్

### మెడికల్ కళాశాలకు అనుబంధంగా కొనసాగింపు

యాదాద్రి భువనగిరి నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లాకు కొత్తగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల మంజూరైంది. ఈ మేరకు రాష్ట్ర వైద్యరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ పరిపాలన అనుమతులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 కాలేజీలకు అనుమతి ఇవ్వగా, అందులో యాదాద్రికి కూడా అవకాశం కల్పించారు. కళాశాల స్థాపన కోసం రూ. 26 కోట్లతో అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ ఇచ్చారు. 60సీట్లతో కళాశాల ప్రారంభం కానుంది. ఇప్పటికే జిల్లాలో ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధంగా నర్సింగ్ కాలేజ్ కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కళాశాలకు సంబంధించి సివిల్ వర్క్, ఫర్నిచర్, ఉపకరణాలు తదితర అవసరాలను తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చూసుకోనుంది. కాగా గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్ కార్యకర్తల సభగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు

- వేసిన 2,500 కుర్చీలకు సగం ఖాళీ
- మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన హాస్టల్ విద్యార్థులు

నల్లగొండ రూరల్,నవంబర్ 22: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సభ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంగా జరిగింది. ఈ ఉత్సవాలకు జిల్లా యంత్రాంగం ఎన్జీ కళాశాల మైదానంలో సుమారు 2,500 కుర్చీలు ఏర్పాటు చేశారు. దీని కోసం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు. భారీగా జనసమీకరణ కూడా చేశారు. నల్లగొండ పట్టణంలోని పలు హాస్టల్ విద్యార్థులను కూడా తరలించారు. అయితే సభలో ఎక్కువగా కాంగ్రెస్ కార్యకర్తలే కనిపించారు. అదికూడా నల్లగొండ నియోజకవర్గంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల ముఖ్య నాయకులు ఉన్నారు. ఈ విజయోత్సవాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బీఎల్‌ఆర్, వీరేశం హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించి అనంతరం రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్వరంలో నాటకం ప్రదర్శించారు. ఈ నాటకంలో ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లో చైతన్యం కల్పించే విధంగా రూపొందించారు. ఈ ఒక్క నాటకం అక్కడికి వచ్చిన విద్యార్థులకు బోర్ కొట్టి వెళ్లి పోతుండడంతో వెంటనే మంత్రి వెంకట్ రెడ్డి ప్రసంగించేలా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ మంత్రి మాట్లాడే సమయానికి అక్కడ ఉన్న సగం కుర్చీలు ఖాళీ అయ్యాయి. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నల్లగొండలో నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సభలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

## జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో మిర్యాలగూడ యువకుడి ప్రతిభ

మిర్యాలగూడ, నవంబర్ 22 : ఈనెల 17 నుంచి 21 వరకు మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో జరిగిన 68వ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మిర్యాలగూడకు చెందిన తమ్మనేని అన్విత్‌నిహాల్‌రెడ్డి తెలంగాణ జట్టు తరుపున ఉత్తమ ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సిల్వర్ మెడల్ సాధించిన అన్విత్‌నిహాల్‌రెడ్డి మిర్యాలగూడ డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా కోచ్ ఎం.రామకృష్ణ వద్ద శిక్షణ పొంది ఆ తరువాత ఫుల్‌టైం శిక్షణ కోసం హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిపారు. క్రీడాకారుడిని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ పి.నవీన్ అభినందించారు.




సిల్వర్ మెడల్ అందుకుంటున్న అన్విత్‌నిహాల్‌రెడ్డి




హాలియా జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

## లెక్చరర్‌ను నియమించాలని విద్యార్థుల ధర్నా

- డీఐఈఓ నిర్లక్ష్యంతో అన్యాయం జరిగిందని ఆందోళన

హాలియా, నవంబర్ 22 : డీఐఈఓ నిర్లక్ష్యంతో తమకు మ్యాథ్స్ లెక్చరర్ లేకుండా పోయారని, తమ చదువుకు ఆటంకం కలిగించిన డీఐఈఓను సస్పెండ్ చేయాలని హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆందోళన చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్ మాట్లాడుతూ హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 120 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. నల్లగొండ డీఐఈఓ ఇంటర్ బోర్డుకు హాలియాలో మ్యాథ్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు ఖాళీ చూపించకపోవడంతో ఇంటర్‌బోర్డు అధికారులు సైతం విద్యాసంవత్సరం ప్రారంభమై 6 మాసాలు కావస్తున్నప్పటికీ మ్యాథ్స్ లెక్చరర్‌ను నియమించలేదని తెలిపారు. కళాశాలకు మ్యాథ్స్ లెక్చరర్ కావాలని కొద్దికాలంగా కళాశాల ప్రిన్సిపాల్, డీఐఈఓకు తెలియజేసినప్పటికీ ఫలితం లేదని చెప్పారు. డీఐఈఓ తీరుతోనే విద్యార్థులు నష్టపోయారని, వెంటనే డీఐఈఓను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లాలో హాలియాతోపాటు మిర్యాలగూడ, నకిరేకల్, నార్కట్‌పల్లి, దేవరకొండ తదితర జూనియర్ కళాశాలల్లో ఫ్యాకల్టీ కొరత ఉందని తెలిపారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులతోపాటు స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులు కోరె రమేశ్, వర్షిత్, నాగరాజు, కార్తిక్, సిద్దు, యశ్వంత్, చందు తదితరులు పాల్గొన్నారు.



తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు శివరాజ్

## శభాష్ టీచర్

### చదువు చెప్పే బడిలోనే కుమారుడిని చేర్పించిన కుర్రారం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు

రాజాపేట, నవంబర్ 22 : తాను చదువు చెప్పే బడిలోనే తన కుమారుడిని చేర్పించి ఓ ఉపాధ్యాయుడు శభాష్ అనిపించుకున్నాడు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఎంపికైన గుజ్జా శివరాజ్ రాజాపేట మండలంలోని కుర్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాడు. కాగా ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన కుమారుడు నాగజితేంద్రను తాను పాఠాలు బోధించే బడిలో శుక్రవారం ఆరో తరగతిలో చేర్పించాడు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో సైతం నాణ్యమైన బోధన అందిస్తారన్న నమ్మకం ఆ ఉపాధ్యాయుడు గ్రామస్తులకు కలిగించాడు. తన కుమారుడిని పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడిని ఎంఈఓ చందా రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి, ఉపాధ్యాయుడు పరమేశ్వర్ అభినందనలు తెలిపారు.

# అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్ ఎటుపాయె..?

## జూలైలోనే అందించాల్సి ఉన్నా పట్టించుకోని ప్రభుత్వం

- తొలి విడుతలో 8,392 మందికి ఇవ్వాలని నిర్ణయం
- బాలురకు చొక్కా, నిక్కరు.. బాలికలకు గౌను..
- మహిళా సంఘాల ద్వారా డ్రెస్ స్టిచింగ్ పూర్తి
- పంపిణీకి సిద్ధంగా ఉన్నా రాష్ట్ర సర్కార్ తాత్సారం

యాదాద్రి భువనగిరి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : అంగన్‌వాడీ చిన్నారులకు ప్రభుత్వ ఉచిత యూనిఫామ్ పత్తా లేదు. డ్రెస్‌లు పంపిణీకి సిద్ధంగా ఉన్నా ప్రభుత్వ తీరుతో అమలుకు నోచుకోవడం లేదు. తొలి విడుతలో భాగంగా 8,392 మంది చిన్నారులకు అందించకుండా తాత్సారం చేస్తున్నది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని, అందుకే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

### తొలుత 8,392 మంది చిన్నారులకు..

ప్రభుత్వం ఇప్పటి వరకు సర్కార్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకే ఉచిత యూనిఫామ్ ఇస్తున్నది. ఇక నుంచి అంగన్‌వాడీ స్కూళ్లలో చదువుతున్న చిన్నారులకు కూడా యూనిఫామ్ కుట్టించి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. జిల్లాలో మోత్కూరు, రామన్నపేట, ఆలేరు, భువనగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 901 అంగన్ వాడీ కేంద్రాలున్నాయి. వాటిల్లో 19,405 మంది చిన్నారులు నమోదయ్యారు. 414 అంగన్ వాడీ కేంద్రాలు ప్రాథమిక పాఠశాలల ఆవరణల్లో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్ ఇస్తున్నదున వారితోపాటు అంగన్ వాడీ కేంద్రాల విద్యార్థులకు కూడా తొలుత యూనిఫామ్ అందించాలని భావించారు. మిగతావి రెండో దశలో అమలు చేయాలని నిర్ణయించారు. ఈ పథకంలో తొలి విడుత 414 కేంద్రాల్లో 8,392 మంది చిన్నారులకు లబ్ధి చేకూరనుంది . ఇక సూర్యాపేటలో 8,575, నల్లగొండ జిల్లాలో 11,158 మంది చిన్నారులు ఉన్నారు.



అంగన్‌వాడీ యూనిఫామ్

### టెస్కో ద్వారా క్లాత్ సరఫరా

చిన్నారులను ఆకర్షించేందుకు ప్రభుత్వం పలు రకాలు, డిజైన్లలో యూనిఫాంను ప్రభుత్వం ఎంపిక చేసింది. చిన్నారుల యూనిఫామ్‌కు సంబంధించి బాలురకు చొక్కా, నిక్కరు, బాలికలకు గౌను డిజైన్ ఫైనల్ చేసింది. రెడ్, యాష్, బ్లూ, వైట్ నాలుగు రంగుల్లో క్లాత్‌ను ఎంపిక చేసింది. ఉమ్మడి జిల్లాలో 19,237 మీటర్ల రెడ్ క్లాత్, 19,237 మీటర్ల యాష్ , 10,398 మీటర్ల బ్లూ, 7,032 మీటర్ల వైట్ కలర్ క్లాత్ అవసరం పడుతుందని అంచనా వేశారు. జిల్లాకు టెస్కో ద్వారా క్లాత్‌ను సరఫరా చేశారు.



అంగన్‌వాడీలో చిన్నారులను చదివిస్తున్న టీచర్(ఫైల్)

### పంపిణీకి ఆదేశాలు రాలేదని..

ప్రభుత్వం స్కూల్ విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్‌లో మహిళా సంఘాలకు ఇవ్వడంతో విజయవంతంగా పని పూర్తి చేశారు. దీంతో చిన్నారుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలను సెర్ప్‌కు అప్పగించారు. మహిళా సంఘాల ద్వారా డ్రెస్‌లను కుట్టించారు. స్టిచ్చింగ్‌కు ఒక్కో బాలిక యూనిఫామ్ కు రూ.60, బాలుడికి రూ.80 చెల్లించారు. దీంతో మహిళలకు మరింత ఉపాధి లభించినట్లయ్యింది. అయితే పంపిణీకి డ్రెస్‌లు సిద్ధంగా ఉన్నాయి. వాస్తవానికి జూలైలోనే చిన్నారులకు అందించాల్సి ఉంది. కానీ నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పత్తాలేవు. ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు.

### తారతమ్యాలు, కల్మషాలకు తావు లేకుండా..

తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రభుత్వ బడులు, అంగన్ వాడీలు ఎంతో అభివృద్ధి చెందాయి. ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా సదుపాయాలు కల్పిస్తున్నారు. సర్కారు బడుల్లో మంచి విద్య అందుతున్నది. అయితే అంగన్ వాడీలను మరింత బలోపేతం చేయడానికి ఇప్పుడు యూనిఫామ్ కార్యక్రమం తీసుకొచ్చారు. ప్రభుత్వ విద్య, పాఠశాలలను ప్రోత్సహించడానికి అంగన్ వాడీలను పటిష్టం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఏకరూప దుస్తులతో తరగతులకు హాజరైతే వారిలో క్రమశిక్షణ ఏర్పడుతుందని, వారి మధ్య తారతమ్యాలు, కల్మషాలకు తావు ఉండదని పేర్కొంటున్నారు.

### త్వరలో పంపిణీకి చర్యలు..

అంగన్ వాడీల్లో చిన్నారులకు యూనిఫామ్ మహిళా సంఘాల ద్వారా కుట్టించాం. డ్రెస్‌లు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో పంపిణీ ఆలస్యం అవుతున్నది. త్వరలోనే చిన్నారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– నర్సింహారావు, పీడీ, ఐసీడీఎస్